క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలలకు నిబంధనలు అవసరం లేదా?


జగన్

కడప ఎడ్యుకేషన్: విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు సాధించే అవకాశం గ్రామీణులకు లేకుండాపోతోందని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఆర్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గ్రామీణ విద్యార్థులకు కిలోమీటర్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు మాత్రమే చూపిస్తోందన్నారు. అయితే పట్టణాల్లోనే ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా ఉండడంతో ఆ పరిధిలో 5 నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఆన్‌లైన్‌లో కిలోమీటరు పాఠశాలలే చూపడంతో వాటికి దరఖాస్తు చేసుకునే వారికి తగిన అవకాశం లేకుండాపోయిందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అధికారులతో చర్చలు జరిపి కిలోమీటరు పరిధి లేకుండా ఉచిత విద్యకు అప్లై చేసుకునే అవకాశం కల్పించాలని వారు కోరారు.

సీసీ కెమేరాలు తప్పనిసరి


మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ రెడ్డెప్ప

కడప అర్బన్: దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, మసీదుల వద్ద సీసీ కెమేరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని సీఐ రెడ్డెప్ప కోరారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో అన్ని మతాల గురువులతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ చోరీలు, అవాంచనీయ సంఘటనలు, దాడులు జరగకుండా ఉండేందుకు కెమేరాలు దోహదపడతాయన్నారు. మందిరాల వద్ద అనుమానితులు తిరిగితే, తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐలు తాహిర్‌హుస్సేన్, తులసీ నాగప్రసాద్, పి.మహేష్, దానియేలు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల గణన

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని విభాగాల వీధి వ్యాపారుల గణన త్వరలో చేపడుతున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వీధి వ్యాపారుల స్థితిగతులు తెలుసుకోవడం, పభుత్వ పథకాల అనుసంధానం, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు బ్యాంకుల నుంచి రుణాలందించడం వంటి వాటిని చేపడుతున్నట్లు తెలిపారు. ×వెండర్ కనెక్ట్ పేరుతో మెప్మా సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులతో కలిసి ఈ నెల 14వ తేదీ నుంచి 19 తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. నగర పరిధిలోని వీధి వ్యాపారులు ఇందుకు తమవంతుగా సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.

దుర్గమ్మా...దయ చూడమ్మా!


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్: కడప విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు మంగళవారందోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని.. అనంతరం ఆలయ ప్రాంగణంలో పూజలు చేశారు. అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఉరుసు


ప్రార్థనలు చేస్తున్న ఖాదర్‌బాషా

కడప ఎడ్యుకేషన్: హజరత్ కేసు దరాజ్ బంద నవాజ్ రహమతుల్లాహి అలె వారి ఉరుసు మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు సురక్షితంగా ఉండాలని, యుద్ధంలో సైన్యానికి ఆ దేవుడు మంచి బలం ఇవ్వాలని కోరుకున్నానని తెలిపారు. ఫయాజ్ ముజావర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా జ్ఞానేశ్వరి

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా జ్ఞానేశ్వరి నియమితులయ్యారు. కర్నూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న జ్ఞానేశ్వరి పదోన్నతిపై కడప బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వచ్చారు. ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో హబీబుల్లా, చెప్పలి రాజారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనాలకు తుప్పు.. ఎవరిదీ తప్పు?







ఒకప్పుడు అధికారులు మాపై కూర్చొంటే దర్జాగా తిరిగాం... దర్పం ప్రదర్శిస్తూ ఠీవీగా ముందుకు వెళ్లి నిలుచున్నాం. జనం ముందు మేము వెళ్లి ఆగినప్పుడు వారు దండాలు పెడుతుంటే మాకే పెడుతున్నారనే గర్వంతో పులకించి పోయేవారం... ఇలా జిల్లా అంతటా తిరిగి తిరిగి అలుపొచ్చింది....మా ఇంజిన్లు, చక్రాలు ముందుకు కదలడానికి మొరాయించాయి. దీంతో ఇదిగో ఇలా మూలన పడేశారు. తుక్కుకైనా వేస్తే కొత్తగా మళ్లీ పుడతామన్న ఆశతో ఉన్నాం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగాలి


మాట్లాడుతున్న కడప ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్

సిద్దవటం : చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంపునకు వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నారని ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో మంగళవారం కడప ఊటుకూరు ఏరువాక కేంద్రం వారి ఆధ్వర్యంలో చిరు ధాన్యాలు సాగులో కీలక నిర్వహణ పద్ధతులు, విలువలు జోడింపు అనే అంశంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలలో పొట్టు లేనివి మూడు రకాలు ఉన్నాయని, అవి జొన్న, సజ్జ, రాగి వీటికి పైపొట్టు తొలగించాల్సిన అవసరం లేదన్నారు. మిగతా 6 చిరు ధాన్యాలు కొర్రలు, అండు కొర్రలు, ఊదలు, అరికలు, సామలు, బరిగలు ఉన్నాయన్నారు. వీటిని ఆహారానికి, ఆదాయానికి, పశుగ్రాసానికి సాగు చేస్తారన్నారు. విత్తన మోతాదు కూడా చాలా తక్కువ, వీటిని పోషక తృణధాన్యాలు అని కూడా పిలుస్తారన్నారు. గ్లూటెన్ రహిత, గ్లైసిమిన్ సూచిక తక్కువ, ఆహారం పీచు, విటమిన్స్, జింక్, ఐరన్, మెగ్నీషియం, పొటాష్ వంటి ఖనిజాలు ఉంటాయన్నారు. మల బద్ధకాన్ని నివారిస్తాయన్నారు. వీటితో రొట్టెలు, ముద్ద, బిస్కెట్స్, మాల్ట్, జావా వంటివి కూడా తయారు చేస్తారన్నారు. ఇంట్లోనే ఉండి విలువ జోడింపు చేస్తే ఆదాయం బాగా ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారికి కృషి విజ్ఞాన కేంద్రం పూర్తి స్థాయి శిక్షణ ఇస్తుందన్నారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద భారతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ సౌజన్యంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బద్వేల్ ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ చిరు ధాన్యాలు అంతర పంటగా, మిశ్రమ పంటలుగా సాగు చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, సిద్దవటం సీఈఓ సునీల్‌కుమార్, రైతులు, మహిళలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏకలవ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం వారు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నరసింహుడి కల్యాణం


వెయ్యినూతలకోనలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కొన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం మంగళవారం వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కనులారా తిలకించారు. ముందుగా భక్తులు కోనేర్లల్లో స్నానాలు అచరించి స్వామివారికి మొక్కులు చెల్లించి కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారికి మధ్యాహ్నం గజవాహన సేవ, సాయంత్రం ధ్వజ అవరోహణం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారిని కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం చేశారు. ఉత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా జరిగాయి.

100 క్వింటాళ్ల జనుములు మంజూరు


రమేష్‌రెడ్డి, ఏఓ

సిద్దవటం : మండలానికి 100 క్వింటాళ్ల జనుములు విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండల పరిధిలోని రైతుసేవా కేంద్రంలో జనుముల విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. 2025 ఖరీఫ్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో భాగంగా జనుము విత్తనాలు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జీలుగలు మాత్రం ఈ సీజన్‌కు అందుబాటులో లేవని చెప్పారు. ఒక ఎకరానికి 10 కిలోల విత్తనాల మోతాదు, తద్వారా 8 నుంచి 10 టన్నులు పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు. ఒక టన్ను పచ్చిరొట్ట ఎరువులో 4 కిలోల నత్రజని, 1కిలో భాస్వరం, 5.3 కిలోల పొటాష్, లభిస్తుందని తెలిపారు. పూర్తి ధర 10 కిలోలు రూ. 1090 కాగా 50 శాతం సబ్సిడీ పోను రైతు చెల్లించాల్సిన ధర రూ. 545 మాత్రమేనన్నారు. జనుము విత్తనాలు కావలసిన రైతులు రిజిస్ట్రేషన్‌కు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి సమస్య

సిద్దవటం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. నీటి సమస్య వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ఆసుపత్రికి సిద్దవటంతోపాటు అట్లూరు, ఒంటిమిట్ట మండలాల నుంచి రోగులు వస్తుంటారు. మంగళవారం మధ్యాహ్నం రోగులు భోజనం తిన్న తరువాత తాగు నీటి కోసం అవస్థలు పడ్డారు.

రోగులతో పాటు వచ్చిన వారు బయటకు వెళ్లి వాటర్ ప్యాకెట్లు కొని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. సంబంధిత డాక్టర్‌లు రోగులకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని రోగులు కోరుతున్నారు.

15 నుంచి ఇస్కాన్ సమ్మర్ కల్చరల్ క్యాంప్

కమలాపురం : స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి ఇస్కాన్ సమ్మర్ కల్చరల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రెడ్డి సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ వరకు జరిగే ఈ క్యాంప్‌లో భగవద్గీత శ్లోకాలు, నీతి కథలు, ధ్యానం, క్రీడలు, నృత్యం తదితర అంశాలపై శిక్షణ నిస్తారన్నారు. 5, 6, 7, 8, 9వ తరగతి బాల బాలికలు అర్హులన్నారు. 14వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 29వ తేదీ శిక్షణిచ్చిన అంశాలపై పరీక్ష నిర్వహిస్తామని, 30వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన అందులో పేర్కొన్నారు. ఆసక్తి గల బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

15న జాబ్ మేళా

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు డోనో, బీపీఓ, ఐటీ సొల్యూషన్స్, ఎఐఎల్ డిక్సన్, అరమ రాజా గ్రూప్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా ఎలక్ట్రానిక్స్, ట్రియో విషన్, కాంపోసైట్ టెక్నాలజీ తదితర 15 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మహానాడు భద్రత ఏర్పాట్ల పరిశీలన

చింతకొమ్మదిన్నె : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర స్థాయి మహానాడు సమావేశ భద్రత ఏర్పాట్ల పరిశీలన కొరకు మంగళవారం ఎస్ఎస్‌జీ, ఇంటెలిజెన్స్ పోలీసు ఉన్నతాధికారులు పబ్బాపురం సమీపంలోని మహానాడు సమావేశ ప్రాంతాన్ని పరిశీలించారు. భద్రత ఏర్పాట్ల పర్యవేక్షణకు వచ్చిన పోలీసు ఉన్నతాధికారుల బృందంతో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లెలో లక్ష్మీనరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాలు మంగళవారం ఆలయ కార్య నిర్వాహకులు నిర్వహించారు. ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకం, గణపతి పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలు పొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. పోటీలు చూడడానికి వేర్వేరు ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు.

నేటి నుంచి కన్యకాంబ మహాకుంభాభిషేకం


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్: కడప నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో బుధవారం నుంచి మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంబంధిత బ్రోచర్లను ఆవిష్కరించి కార్యక్రమ వివరాలు మంగళవారం వారు విలేకరులకు తెలియజేశారు. వాసవీ మాత నూతన ఆలయంలో పునః ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాలను శంకరాచార్య, శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఈ మహోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 7.30 గంటలకు గంగానయనం, గోపూజ, గణాధిపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, శతచండీ పారాయణం, హోమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5.30 నుంచి మృత్సంగ్రహణం, అంకురారోపణం, నవావరణ మంత్రజపం, లక్ష కుంకుమార్చన తదితరులు ఉంటాయన్నారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ప్రాతఃకాల పూజ, శత చండీ పారాయణం, మహాలింగార్చన, రుద్ర, నారాయణ హోమాలు, శ్రీ వాసవీమాతకు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రదోష పూజ, లక్ష కుంకుమార్చన వేద పారాయణం ఉంటాయన్నారు. శుక్రవారం ఉదయం 6.00 గంటలకు ప్రాతః కాల పూజ, శతచండీహోమం, కుమారి సువాసిని పూజ, కలశోద్వాశన, శ్రీ జగద్గురువులచే మహాకుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6.00 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15, 16 తేదీలలో కడప నగరానికి విధుశేఖర మహాభారతి స్వామి విచ్చేసి శిష్య గణాన్ని అనుగ్రహించనున్నట్లు తెలిపారు. 15న సాయంత్రం 6 గంటలకు పూర్ణకుంభ స్వాగతంతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు స్వాగతభాషణం, రాత్రి 9 నుంచి 10 గంటల వరకు చంద్రమౌళీశ్వరపూజ ఉంటాయన్నారు. 16న ఉదయం 8.00 గంటల నుంచి చంద్రమౌళీశ్వర పూజ, 10.00 గంటలకు సద్గురు సన్నిధానం వారి పాదపూజ, భిక్షావందనం, వస్త్ర సమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు వివరించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సూరు వినోద్‌కుమార్‌శ్రేష్ఠి, తల్లం వెంకట సతీష్‌కుమార్‌శ్రేష్ఠి, చింతకుంట పుల్లయ్య శ్రేష్ఠి, బెస్తవేముల రామమహేష్ తదితరులు పాల్గొన్నారు.

20న లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోందని పేర్కొన్నారు. కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. వాటితో కార్పొరేట్లకు లాభాలు పెరిగి, కార్మికులంతా హక్కులు లేని బానిసలుగా మారుతారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నల్ల చట్టాలతో రైతులను, నాలుగు లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ కార్మిక వ్యతిరేక విధానాలను సమ్మె ద్వారా కట్టడి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులంతా సమ్మెను బలపరచాలని, మోదీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులురెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ. బాదుల్లా, మద్దిలేటి, సుబ్బరాయుడు, చంద్రారెడ్డి వెంకటసుబ్బయ్య, మల్లికార్జున, పవన్, తదితరులు పాల్గొన్నారు

డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దుచేయాలి


వైవీయూ రిజిస్ట్రార్‌కు విన్నవిస్తున్న నాయకులు


కడప ఎడ్యుకేషన్: బ్రహ్మంగారిమఠంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దుచేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాల జయవర్ధన్, జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మను ఈ విషయమై మంగళవారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక చోట అనుమతి ఉంటే మరొక చోట తరగతులు నిర్వహిస్తూ డిగ్రీ కళాశాల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఆర్టీసీ బస్సుషెల్టర్, అన్నదాన సత్రంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తూ అధిక ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. బ్రహ్మంగారి వారోత్సవాల్లో భాగంగా సత్రంలో అన్నదానం నిర్వహిస్తుంటే మరో వైపు విద్యార్థులు అక్కడే పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మొక్కల పెంపకంతో కాలుష్యానికి చెక్


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కడప అగ్రికల్చర్: మొక్కల పెంపకంతో పర్యావరణ కాలుష్యానికి చెక్ పెట్టవచ్చునని తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి లావణ్య అన్నారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడప నగర శివారులోని తాడిగొట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వన మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా 20 చొప్పున కానుగ, నేరేడు, గుల్మోహర్, ఎర్రచందనం, ఫెల్టోస్ రైస్, వేప మొక్కలను కీటక శాస్త్రవేత్త డాక్టర్ పాండురంగ పరిశీలనలో నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకంతో కాలుష్యం తగ్గి సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. అభ్యుదయ రైతు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మొక్కలు నాటడంతో భవిష్యత్తు తరాలకు మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాంద్ ఫిరా గుంబద్ దర్గా ఉరుసు


చాంద్‌ఫిరా గుంబద్ దర్గా

కడప కల్చరల్: కడప రహంతుల్లా వీధిలో వెలసిన చరిత్రాత్మకమైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహంతుల్లా అలైహి (చాంద్‌ఫిరా గుంబద్ దర్గా) ఉరుసు ఉత్సవాలు ఈ నెల 14వతేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నీసా ఓ ప్రకటనలో తెలిపారు. 14న బుధవారం రాత్రి గంధం రోజు దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుంచి ఫకీర్లు మేళ తాళాలు, విన్యాసాలతో దర్గా వద్దకు చేరి గంధాన్ని సమర్పిస్తామన్నారు. 15న గురువారం ఉరుసు, 16న శుక్రవారం తహలీల్ ఫాతెహా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉరుసు, తహలీల్‌రోజున గొప్ప ఖవ్వాలీ పోటీ జరుగుతుందని వివరించారు. ఉరుసు రోజున రాత్రి ముంబై నుండి ప్రముఖ ఖవ్వాల్ ఇమ్రాన్ సాబ్రి, గోవా నుండి ప్రముఖ ఖవ్వాల్ చాంద్ ఆతీష్, తహలీల్ రోజున రాత్రి ప్రముఖ ఖవ్వాల్ ముంబై నుండి ఇమ్రాన్ సాబ్రి, మైసూర్ నుండి నిజామ్ నవాజ్‌లు పాల్గొంటారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురువుల ఆశీస్సులు పొందాలని ఆమె కోరారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న జంబారపు అహరోన్

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబారపు అహరోన్ తెలిపారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీహెచ్ఏ, ఎంపీహెచ్ఎస్ క్యాడర్‌తోపాటు ఇతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరి శివయ్య, జోనల్ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి మహబూబ్‌బాషా, జనార్దన్‌బాబు, శ్రీనివాసులు నాయక్, సుధాకర్ రాజు,ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య కళ్యాణ మూర్తుల బ్రహ్మోత్సవాలు


ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న సాయినాథ్ శర్మ

కమలాపురం : మండలంలోని రామాపురంలోని శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సంజీవిని మూలిక సహిత వీరాంజనేయస్వామి వారి బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులుగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన సేవకుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు భక్తులు విశేష సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మాడ వీధులలో దేవతా మూర్తుల ఊరేగింపు ఉత్సవం కనుల పండువగా జరుగుతోంది. భక్తులకు అన్నదాన ఏర్పాటు చేస్తున్నారు.

ఎంపీ ప్రత్యేక పూజలు

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వారికి సాయినాథ శర్మ వివరించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విగ్రహ మూర్తులు ఇక్కడ వెలియడం జిల్లాకే తలమానికం అని ఆయన సాయినాథ శర్మ అభినందనీయుడు అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు ఘనపాఠి వంశీకృష్ణ శర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నలుగురు మట్కా బీటర్ల అరెస్టు

కడప అర్బన్: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల మట్కా రాస్తున్న నలుగురిని ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 5600 నగదుతో పాటు, మట్కా స్లిప్‌లను సీజ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వల్లూరు : మండలంలోని చెరువుకిందపల్లె గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న ఆరు మందిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి చెరువుకిందపల్లె గ్రామ సమీపంలోని ముల్లపొదల్లోని జూద స్థావరంపై దాడులు నిర్వహించి ఆరు మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ 6500 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.